# "ఓటు నవ్వింది"

ముల్లుగఱ్ఱ సావిట్లో మూలపెట్టి, చెప్పులువిడిచి, ముంతతో నీళ్ళు ముంచుక, కాళ్ళు కడుక్కున్నాడు చలమయ్య.

కంచంలో అన్నంవడ్డించిన మంగమ్మ మెల్లని స్వరాన అంది.

'పెదనాయుడు నిన్ను రమ్మని కబురంపాడు ?'

కలుపుకోబోతున్న అన్నం వదిలి, "ఎప్పుడు !" అన్నాడు కంగారుగా చలమయ్య.

"నువ్వట్టా ఎగదాలచేలోకి వెళ్ళావో లేదో, ఇట్టా వచ్చాడు వాళ్ళ జీతగాడు శాయిలు. ఉన్నపళాన నిన్నుపిల్చుకు రమ్మన్నాడట నాయుడు." చలమయ్య పీటమీదనుంచి దిగ్గున లేచాడు.

"అన్నంతినిపోరాదూ ?" అంది మంగమ్మ నొచ్చుకుంటూ.

"మళ్ళీ వస్తాలే !" అంటూండగానే, వరండాలోనుంచి శాయిలు పిలుపు వినిపించింది. "పద వస్తున్నా!" అంటూనే చెప్పులు తొడుక్కుని, శాయిలువెంట నడిచాడు చలమయ్య. వరండాలో కుర్చీలో కూర్చునివున్న నాయుడు సాదరంగా ఆహ్వానించాడు "ఏం చలమయ్యా ! కనిపించటమే లేదు !" అన్నాడు ఆప్యాయత కురిపిస్తూ.

చలమయ్య నిర్లిప్తంగా తలూపాడు. "దున్నకం మొదలెట్టా.... తీరటంలా. అన్నట్టు ఎందుకో కబురంపావుట ?" స్తంభానికి చేరబడి కూర్చున్నాడు.

ఆమాట ఈమాట మాట్లాడి ఆయువుపట్టు ప్రశ్న వేశాడు నాయుడు "నీ ఓటు ఎవరికిస్తావు చలమయ్యా ?"

"ఇంకా ఏదీ అనుకోలేదులే. అయినా రెణ్ణెల్లుందిగా ఎలక్షను!" అన్నాడు చలమయ్య నీళ్లు నములుతూ.

"రెణ్ణెల్లుగానీ, రెండేళ్లుగానీ, నువ్వు నాకిస్తావా? రెడ్డి కిస్తావా!" క్షణకాలం చలమయ్య మాట్లాడలేదు.

చలమయ్యవేపు నిశితంగాచూచి, ఏదో అర్థం చేసుకున్నట్లు తల పంకించాడు నాయుడు. మెల్లిగా అన్నాడు చిరునవ్వుతో, "ఆలోచించుకునే చెప్పు చలమయ్యా! తొందరేంలేదు పదిరోజులు ఆగాకే ఏసంగతీ చెబుదువుగానీలే! సరే వెళ్ళిరా! అన్నట్లు నీ పిల్లాడికి వచ్చేఏడు హైస్కూల్లో, హాస్టల్లో సీటు తేవాలిగా? ఊ! వెళ్ళిరా?"

వెనకనుంచి వినిపిస్తున్న నాయుడి కంఠస్వరం సింహగర్జనలా అదరగొడుతూనే వుంది. అడుగులు గబగబ పడ్తున్నాయ్! నాయుడిచివరి మాటలలోని ఆంతర్యం తనకు అవగతమౌతూనే వుంది. తన కొడుకు నాంచారుకు చదువంటే వల్లమాలిన ఆపేక్ష. కానీ వాణ్ణి హైస్కూల్లో చేర్చి, నెల నెలా డబ్బుపంపుతూ చదివించే స్తోమతు తనకులేదు. హాస్టల్లో చేర్చాలి! హాస్టల్లో చేరటానికి ఎన్నో రికమెండేషన్లుకావాలి.... ఒక్కసారి వాడు "హరిజన్" అని దొంగ సర్టిఫికేట్ సృష్టించాలి. ఇలాటి పనులన్నీ నాయుడికి కొట్టినపిండి! తనకు నమ్మకంగా ఓటిచ్చిన వాళ్ళతో, ఒప్పందం చేసుకున్న మేరకు, వాళ్ళ పిల్లలను హరిజనులగానో, గిరిజనులగానో మార్పించో, మంత్రించో, తనకు బాగా పలుకుబడివున్న ఓ మంత్రిగారి ద్వారా, బెల్లించో, బెదిరించో, ఎలాగో ఓలా హాస్టల్లో సీట్లు తెప్పించాడు.

నిజంగా "హరిజనులు" అయినా, తనకు ఓటివ్వనివారినీ, ఇచ్చినట్లు నమ్మకం లేనివారినీ, అధఃపాతాళానికి అణగద్రొక్కేసాడు. "నో సీట్" అనిపించేసాడు నవ్వుతూనే. ఈనాడు తనీ బోనులో చిక్కు-

తున్నాడు. నాంచారు భవిష్యత్తూ, తనజుట్టూ, నాయుడి చేతిలోనే వున్నాయి!

"ఏమిటోయ్! చలమాయ్! బొత్తిగా నల్లపూసవైపోయావ్?" ప్రశ్నవిని త్రుళ్ళిపడ్డాడు చలమయ్య. ఎదురుగా నిల్చుని నవ్వుతున్నాడు రెడ్డి!

"సేద్యపు అదును...." గొణిగాడు.

"రారాదూ! అట్లా మా ఇంటికిపోదాం,"

"ఊహూఁ ఇంటికెళ్ళాలి...."

"సర్లె! అన్నట్లు....మా భూమిక్రిందే సాగుచేసుకుంటున్న నీ శివాయి భూమిలో ఏంవేస్తావ్!" సాదరంగా అడిగాడు రెడ్డి.

"ఈఏడు వరి వేద్దామనుకుంటున్నాను!"

"ఓయబ్బో! నీళ్ళు బాగావుండాలే. చెర్లోనీళ్ళు నా కయ్యలదాకా వచ్చేసరికే, గంగమ్మ దిగివచ్చినంత పనౌతుంది. ఇక అవి నీ కయ్యలూ తడపాలన్నమాట. నా కాలవబూడి పోయేనా? నీ పని ఖాళీయే...." రెడ్డి నవ్వుతూ విసిరిన చివరిమాట చెలకోల దెబ్బలా తగిలింది చలమయ్యకు.

ఏభై ఎకరాల మాగాణి భూమిగల రెడ్డిగారి కాలవ బూడి పోవట మంటే? పూడిపించటం...అంటే...? తన నోట్లో, తన భార్యా బిడ్డల నోట్లో మన్ను...!

"ఆ రామిగాడు చూశావా ఏంశాడో?" రెడ్డి ప్రశ్నతో ఆలోచన నుంచి తేరుకున్నాడు చలమయ్య. "ఏంచేశాడు!" అన్నాడు. తడారిపో తున్న పెదవులు నాలుకతో తడిచేసుకుంటూ.

"నాప్రాణంతోడి, శివాయిభూమి కావాలన్నాడా? పోన్లే, ఎక్కడికి పోతాడని, నా కయ్యలనానుకునే, రెండెకరాల శివాయి భూమి ఇప్పించానా

ఇప్పుడు ఓటు నాయుడికి ఇస్తానంటున్నాడట ! వీడి తలతిక్క ఇలా వుం దాని, నీళ్లు బిగించాను.... ఛస్తున్నాడు వెధవ !" గర్వంగా మీసం దువ్వు కున్నాడు రెడ్డి. ఆ రామిగాడి విషయం, ఇప్పుడు తనతో చెప్పటంలో రెడ్డి ఆంతర్యం చెప్పకనే తేటతెల్లమైంది .... గుండె ఝల్లుమంది చలమయ్యకు.

" ఏరోయ్ కోటిరెడ్డీ ! నువ్వేమిటో కుప్పిగంతులేస్తున్నావుట ! రెడ్డికి పుట్టినోడివైతే, రెడ్డికే ఓటివ్వు. లేకుంటే, నీయిష్ట మొచ్చినవాడి కిచ్చుకో...."చలమయ్య ఎదురుగానే, పక్కగా వెళ్ళుతున్న కోటిరెడ్డిని, పనిమాలీ పిలిచి మరీ మందలించాడు రెడ్డి.

"నేను రెడ్డికేపుట్టా" రోషంగా అరిచి, విసవిసా వెళ్ళాడు కొటిరెడ్డి. గంభీరంగా మీసం దువ్వుకున్నాడు "కుర్రకుంక" అంటూ రెడ్డి !

చలమయ్య మనసు చివుక్కుమంది. కులం పేరుచెప్పి రోషం పెంచటం గొప్పతనమా ? ఏ కులంలో పుట్టినవాళ్ళు, ఆకులం వాళ్ళకే ఓట్లి వ్వాలా ? ఇతరుల కిచ్చిన వాళ్ళ తల్లులంతా కులటలేనా? ఛీ....ఛీ ....ఎంత నీచపుమాటలు ! ఎంత నీచపు సవాల్ !

"అన్నట్టు, రెండేళ్ళనాడు నాకు అడుమానం పెట్టిన నీఅరెకరా— అలాగే పడివుంది. చలమయ్యా ! అప్పుపెరగడం మంచి దంటావా ? అంతగా తీర్చలేకుంటే, ఒక వంద అటూ, ఇటుగా తీరుద్దూగానీలే.... నేనే ఇసాను ఓ నాలుగువందలు అప్పుగా ! కానీలే .... ఈ ఎన్నికలూ .... ఈ గొడవలూ అయ్యాక చూద్దాంలే ! సరే వెళ్ళిరా....నీ ఓటుసంగతి ఆలోచిం చుకునే చెప్పు నాకు.... వెళ్ళొస్తా !" రెడ్డి వెళ్ళిపోయాడు.

పరుగులాంటి నడకతో ఇల్లు చేరుకున్న చలమయ్య, అన్నం తిన్నాననిపించి, మంచంమీద పడుకున్నాడేగానీ నిద్ర రావటంలే దతగాడికి.

మనసు పరిపరివిధాల పరుగులు తీస్తోంది. నాయుడు, రెడ్డి రెండు ఆంబోతులు. ఎవరి బలాబలాలు వారు చూచుకోవటానికీ, ఒకరికి చిక్కకుండా, మరొకరు అధికారాన్ని తన్నుకుపోవటానికీ, మధ్యలో తనలాటి లేగదూడల్ని ఎరలుగా వేసుకుంటున్నారు. ఆంబోతుల కుమ్ములాటలలో తమబోటిగాళ్ళ కాళ్ళు విరిగిపోతున్నాయి.

క్రితంసారి ఎలక్షన్లలో రాజారావుగారు పోటీచేశారు. నీతి నిజాయితీ మూర్తీభవించిన రాజారావు పేదలపాటి దేవుడు! కులమూ, మతమూ ఏదైనా, మనుషులందరూ ఒకటేనన్న మనస్తత్వం కలవాడు!

కానీ అతగాణ్ని అధికారంలోనికి రానిచ్చారా! వూహూఁ! రాజారావు వ్యక్తిత్వానికి ముగ్ధులై, అతగాణ్ణి అభిమానించిన వారందరినీ, నాయుడు, రెడ్డి నానావిధాల రెచ్చగొట్టారు.

"నీ అబ్బ ఎవడురా లక్ష్మయ్యా? రాజారావు అబ్బ కాదు గదా!" అన్నాడు రెడ్డి యువరక్తం పొంగులువారే యువకులతో! ఆ మాటలో దాగి వున్న శ్లేష అర్థమైననారు....రోషంతో విధిలేక రాజారావుకు దూరమైనారు!

ఫలితం మంచితనం, మానవత్వం, సేవాపరాయణత ఓడిపోయింది! అంగబలమూ, అర్థబలమూ, కులబలమూలేని రాజారావును, చిత్రహింసలు పెట్టి వూరినుంచి వెళ్ళగొట్టించారు. రాజారావుమీద అభిమానంవున్న తమబోటివాళ్ళు చాలామంది, అది వెల్లడించుకొనే సాహసంలేక నోళ్ళు నొక్కుకున్నారు. సాహసించి వెల్లడించిన నలుగురైదుగురి బ్రతుకులు రెడ్డి, నాయుడి కాళ్ళ క్రిందపడి, ఎన్ని విధాల నలిగిపోయాయి. ఈ మారు? ఇద్దరికిద్దరూ ధూర్తులు, నీచులు, కిరాతకులు! ఇద్దరిలో ఏ ఒక్కరికి ఓటిచ్చినా, తనకు తను ద్రోహం చేసుకొన్నట్లే అవుతుంది? కాని మానుకునే మార్గం?

భయపెట్టి, మభ్యపెట్టి, గుంజుకున్న ఓట్లు లెక్కబెట్టి, "మమ్మల్ని ప్రజలు అభిమానిస్తున్నారు. అందుకు నిదర్శనం మా మెజారిటీ ఓట్లే. . . చూడండి!" అని రొమ్ము విరుచుకుంటున్న రెడ్డికీ, నాయుడికీ అవి ప్రజాభిప్రాయాలుకాదు. అవి మీరు బలవంతంగా వారిచేత వేయించిన చిత్తుకాగితాలు, లేదా కన్నీటిచుక్కలు. . .నిజానికి మీ ఇద్దరిలో ఏ ఒక్కరినీ, ప్రజలు మనసా, వాచా, కర్మణా అభిమానించడంలేదు. ఏ కులస్తుడైనా ఏమతస్తుడైనా ఫర్వాలేదు. రాజారావులాటి నిజమైన ప్రజాసేవకుడినే ప్రజలు అభిమానిస్తారు!"అని కుండబ్రద్దలుకొట్టినట్లు చెప్పగల ధైర్యశాలి ఏడీ? వున్నా, వాడి భవిష్యత్తు, వాడి పిల్లల చదువులూ, వాడి పొలాల పంట భద్రంగా వుంటాయన్న భరోసా ఏదీ?

బహూశా ఓటుకే నోరువుంటే? అది నిజం చెప్పేసేదేమో? అందుకనేనేమో, నోరులేని కాగితాన్ని ఓటుగా చేశారు.

"ఇంకా నిద్రపోలేదూ?'' మంచంమీదకు వంగి, ప్రశ్నిస్తున్న మంగమ్మ కంఠస్వరంతో త్రుళ్ళిపడ్డాడు చలమయ్య. ఆలోచనల వలయాల లోంచి బయటపడ్డాడు.

"ఊహూఁ!" మంచంమీద వత్తిగిలి భార్య కూర్చోవటానికి చోటిచ్చాడు.

"ఊ! నాకూ నిద్రరావటంలేదు. ఏం ఎన్నికలో ఏం వల్లకాడో, మనబోటిగాళ్ళ పీకెలమీదకి దాపురించాయి ఓట్లు. . .'' చలమయ్య మాట్లాడలేదు.

". . .సాయంత్రం నాయుడి భార్య కబురంపింది, మనిద్దరి ఓట్లు తన మొగుడికే వెయ్యాలట లేకుంటే! నాంచారికి హాస్టల్లోసీటు రాకుండా చేస్తారట. . .! నిన్న రెడ్డిగారి భార్య రమ్మని కబురంపితే వెళ్ళాను. . .

వెళ్ళగానే, దేవుడిపటం నా నెత్తిన, చేతిలో పెరుగన్నం ముద్దపెట్టి ప్రమాణం చెయ్యమంది...."

"ఏమని? ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు చలమయ్య.

"మనిద్దరి ఓట్లూ రెడ్డికే ఇస్తామని...."

"చేసావా?" కంగారుగా చలమయ్య.

"ఊహూం! అలా ప్రమాణం చెయ్యనన్నాను. అంతే! చిందులు తొక్కి.... మనమీద తనకు నమ్మకం లేదంది! ఆ అరెకరా అడుమానం చేనూ, శివాయిభూమిలో జేసుకుంటానంది....అసలట్లా ఎందరిచేతో ప్రమాణాలు చేయించుకున్నారట....?"

చలమయ్య అవాక్కుగా వుండిపోయాడు.

"ఏం చేద్దాం?" మంగమ్మ కంఠస్వరంలో భవిష్యత్తు తాలూకు భయం నిండివుంది....

చలమయ్య పకపక నవ్వాడు పిచ్చిగా, "మనమేనాచావాలి. ఓట్లేనా చావాలి. అప్పుడుగానీ దేశం బాగుపడదే పిచ్చీ! మన వూరూ, మనమేగాదే ఇలా ఏడవటం, దేశమంతా ఇట్లాగేవుంది, ఓట్లు లెక్క జూచుకోనే వాడేగానీ, జనం బాగుకోరేవాడేదే పిచ్చిదానా! జనం బాగుకోరేవాడికి ఓట్లిచ్చేవాళ్ళేరే? ఏదోలే ... ఎలాగో ఓలా తెల్లారుతుందిలే ... పడుకో...ఇక ఆలోచించే శక్తిగానీ, అనునయించే శక్తిగానీ, లేనట్లు నిస్సత్తువగా కళ్లు మూసుకున్నాడు చలమయ్య.

* * * *

ఎలక్షన్‌రోజు రానేవచ్చింది. రెడ్డి తనకు నమ్మకం లేనివారి వెనుక, తన నమ్మినబంట్లను వుంచాడు. కాస్త మొండి ఘటాలకు "కళ్లు కనిపించవ్!" అనిపించి, తనే ఓటువేసే ఏర్పాటు చేశాడు.

నాయుడు కళ్ళసైగలతోనే హెచ్చరిస్తున్నాడు, నాకు నమ్మకంగా ఎన్ని ఓట్లు వచ్చేదీ లెక్క నాకుతెలుసు. నాకు నమ్మకం లేనివాళ్ళెవరో కూడా నాకు తెలుసు ... నా ఓట్లు తగ్గాయి అంటే, మోసం చేసిన వాళ్ళను నేనిట్టే పసిగట్టగలను. వాళ్ళపని పట్టగలను ... అని చెప్పించాడు రహస్యంగా "అతితెలివి" రకాలకు.

రెడ్డిగారివేపూ, నాయుడుగారివేపూ చూస్తున్నారే తప్ప, తాము వేస్తున్న ఓటు వల్ల రాబోయే అధికారంతో, ఆ ఇద్దరి స్వప్రయోజనాలు మాత్రమే సాధింప బడతాయన్న ఆలోచన రావటంలేదు జనానికి. ఆ ఆలోచన వచ్చినవారు కిక్కురు మనలేక పోతున్నారు. చలమయ్య తాతల నాటి కోటు వేసుకున్నాడు. ఓటు కాగితం అందుకుని తెరచాటుకు వెళ్ళాడు. రబ్బరుస్టాంపు ఎత్తేంతలో, పకపక నవ్వు వినిపించి త్రుళ్ళి పడ్డాడు. ఎవరు నవ్వుతున్నారు ? ఓటు కాగితమా ? తన భ్రమకాదుగదా? కాదు ... కాదు... నిజంగానే ఓటు నవ్వుతోంది !

"అరె మనిషీ ! ఎందుకునన్ను సృష్టించావు ?"

ప్రాణంలేని ఓటు నవ్వటమేగాక, మనిషి భాషలో మాట్లాడటం చూచి, పంచప్రాణాలు పై కెగిరిపోయినంత పనైంది చలమయ్యకు.

'అలా బెదరకు నేను నీఓటునే ! కానీ, నీ మనస్ఫూర్తిగా, నీకిష్ట మైన, నిజమైన, ప్రజాసేవకుడికి ఇవ్వగలుగుతున్నావా నన్ను ?" ఓటు మిర్రిచూస్తూ అడుగుతోంది !

"ఊహూఁ !" మూలిగాడు చలమయ్య.

"మరి ? ఎందుకు నన్ను పెట్టెలో వేస్తున్నావు ? నీ అభిప్రాయం కాని ఆత్మవంచనను ఎందుకు సమర్థిస్తున్నావు ? అలా చూడు. ఆ క్యూలో వున్నవాళ్ళంతా నీలాటివాళ్ళే..." కొందరు డబ్బుకు ఆశపడి నన్ను

అమ్మేశారు. మరికొందరు ఈ అభ్యర్థుల రాక్షసత్వానికి భయపడి నన్ను విసిరివేస్తున్నారు. ఇంకా కొందరు కులమతాల మూఢ నమ్మకాలకు బానిసలై నా విలువ చెరిపేస్తున్నారు. ఇంక నా విలువ ఏమిటి?" చలమయ్య మాట్లాడ లేకపోయాడు. అతగాడి కాళ్ళక్రింద భూమి కదులు తున్నట్లనిపిస్తోంది. తలలోని నరాలు పిటపిట మంటున్నాయి. వెయ్యకు, అమూల్యమైన నీ ఓటు ఈ వెధవలకివ్వకు. నన్నూ అవమానపరచి, నిన్నూ కించపరచుకోకు. లే! వెళ్ళు. ఆ బడుద్దాయిలకు చెప్పు. "నిజమైన ప్రజాసేవకుడికే నా ఓటు. మీ కివ్వను." అని చెప్పెయ్!

చలమయ్య కళ్ళుబైర్లు కమ్ముతున్నాయి.

"చెప్పలేవూ!" ఓటు పక పక నవ్వింది. "నాకు తెలుసు. మీరెవరూ చెప్పలేరు. మీరంతా డబ్బుకూ, భయానికీ, పిరికితనానికీ, బానిసలూ, వారసులూ అయిపోయారు. మీఖర్మ? అనుభవించండి. మీ ఓటు ఎలా అయినా తగలెట్టుకోండి. కానీ.... కానీ....మరికొద్ది రోజుల్లోనే మీ ఓట్లే....అంటే మేమే....మిమ్మల్ని సర్వనాశనం చేసివేసే రోజు రాబోతోంది....ఇదినిజం...." ఓటు వెర్రిగా విరగబడి నవ్వుతోంది. చలమయ్యా దబ్బున క్రింద పడిపోయాడు.

స్పృహ తప్పిపోయిన చలమయ్యను బయటకు తెచ్చారు. జనం రకరకాలుగా తర్జనభర్జనలు చేస్తున్నారు.

"దొంగ వెధవ! ఓటు నాకివ్వాల్సి వస్తుందని, ఇదోవేషం వేశాడు! చూస్తాను. వీడి కొడుకు ఎలా హాస్టల్లో చేరుతాడో, ఎలా చదువుతాడో!" లోలోపల మండిపడ్డాడు నాయుడు.

"పిరికి వెధవ! నాయుడికి భయపడి, నాకు ఓటు ఎగగొట్టడానికి ఇదో ఎత్తువేశాడు! ఎక్కడికిపోతాడు? రేపు పంట పొలానికి నీళ్లెలా

వస్తాయో చూస్తాగా ! ఆ వున్న కాస్త పొలం అడుమానం, వడ్డీకింద గొరిగించేస్తాను వెధవని. ఇక వీడూ, వీడి పెళ్ళాం, పిల్లలూ ఏం తింటారో చూస్తాను !'' కసిగా లోలోపల పళ్ళు నూరుతున్నాడు రెడ్డి.

అన్నీ తెలిసిన ఓట్లు, పెట్టెల్లో పదిలంగా కూర్చుని, పక పక నవ్వుకుంటున్నాయి.

(" ప్రగతి " 27_6_69)